క్లుప్తంగా

జీజీహెచ్ సీఎస్ఆర్ఎంవోగా డాక్టర్ రాజకుమారి

కాకినాడ క్రైం: కాకినాడ జీజీహెచ్ సీఎస్ఆర్ఎంవో(సివిల్ సర్జన్ రెసిడెంట్ మెడికల్ ఆఫీసర్)గా డాక్టర్ నేతల రాజకుమారిని నియమిస్తూ శనివారం సాయంత్రం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. డిప్యూటీ సివిల్ సర్జన్‌గా సామర్లకోట, కొవ్వూరు ఆరోగ్య కేంద్రాల్లో పని చేస్తున్న ఆమె ప్రస్తుతం రాజమహేంద్రవరం జీజీహెచ్‌లో డీసీఎస్‌గా కొనసాగుతున్నారు. కాకినాడ జీజీహెచ్ డీసీఎస్ఆర్ఎంవోగా పనిచేస్తున్న డాక్టర్ కె.అనిత పదోన్నతి పొంది సీఎస్ఆర్ఎంవో హోదా లో శ్రీకాకుళం జీజీహెచ్‌కు బదిలీ అయ్యారు.

పాతర్లగడ్డలో రెవెన్యూ సదస్సు

కరప: పాతర్లగడ్డలో శనివారం రెవెన్యూ సదస్సు నిర్వహించి, రైతులను భూసంబంధిత సమస్యలపై అర్జీలు స్వీకరించారు. తహసీల్దార్ ఎస్.సత్యనారాయణ మాట్లాడుతూ భూసమస్య ల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. గ్రామ సర్పంచ్ నాగిరెడ్డి ఏసుబాబు, రీసర్వే డీటీ డి.దుర్గాప్రసాద్, మండల సర్వేయర్ రూపావతి, ఆర్ఐ పవన్‌కుమార్ పాల్గొన్నారు.

వీరబాల దివాస్‌ను అన్ని పాఠశాలల్లో నిర్వహించాలి



జిల్లా విద్యాశాఖాధికారికి వినతిపత్రం అందిస్తున్న బీజేపీ నాయకులు

బోట్‌క్లబ్: వీరబాల దివాస్‌ను జిల్లాలోని అన్ని పాఠశాలల్లో ఘనంగా నిర్వహించాలని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి పెద్దిరెడ్డి రవికిరణ్ అన్నారు. శనివారం స్థానిక జిల్లా విద్యాశాఖాధికారి పిల్లి రమేష్‌ను ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందించారు. సిక్కుల పదో గురువు గురు గోబింద్ సింగ్ మొగల్ చక్రవర్తి ఔరంగజేబ్ దాష్టికాలపై పోరాడుతున్న సమయంలో వారి చిన్న కుమారులు 9 ఏళ్ల వయసున్న బావ జురావర్ సింగ్ ఆరేళ్ల వయసున్న బాబా ఫతేసింగ్‌లను బందిలు చేశారన్నారు. ఇద్దరి పిల్లలను చిత్రహింసలకు గురి చేసి మతం మారమని ఒత్తిడి చేసినా మాట వినకపోవడంతో గోడలో సజీవ సమాధి చేశారన్నారు. ఈ బలిదానాన్ని ఆత్మార్పణగా దేశం మొత్తం డిసెంబర్ 26న వీర బాల దివాస్‌గా జరుపుకొంటున్నారన్నారన్నారు. కేంద్ర ప్రభు త్వం కూడా గెజిట్ నోటిఫికేషన్ ఇచ్చిందన్నారు. జిల్లాలోని ప్రతి పాఠశాలలోను ఈ చిన్నారుల త్యాగాన్ని గుర్తు చేసుకొనేలా తగిన మార్గదర్శకాలు ఇవ్వాలని కోరారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో నాయకులు చిన్నయ్యదొర, కొక్కిలగడ్డ గంగరాజు, తుమ్మలపల్లి నారాయణరావు పాల్గొన్నారు.

పండగను ఆనందంగా జరుపుకోవాలి



చిన్నారులకు దుస్తులు అందిస్తున్న మీనాక్షి సిల్క్స్ అధినేత సూర్యనారాయణ

బోట్‌క్లబ్: రోటరీ చేయూత భవన్‌లో ఆశ్రయం పొందుతున్న చిన్నారులకు పిఠాపురంలోని మీనాక్షి సిల్క్స్ అధినేత పప్పు సూర్యనారాయణ నూతన దుస్తులను శనివారం అందించారు. భవిష్యత్‌లో చిన్నారులకు ఏ అవసరం వచ్చినా తాను చేసేందుకు సిద్ధమని చెప్పారు. రానున్న పండగలకు చిన్నారులకు నూతన దుస్తులు అందించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో చేయూత సంస్థ అధ్యక్షులు రవి కుమార్, ప్రధాన కార్యదర్శి ఎంఏ ఆలీ, సభ్యులు వీర్రాజు, వంశీ, మీనా, కామేష్ పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న తలాటం హరీష్

బోట్‌క్లబ్: నూతన సంవత్సరం అందరికీ శుభప్రదంగా ఉండాలని సానా సతీష్‌బాబు ఫౌండేషన్ చైర్మన్ తలాటం హరీష్ అన్నారు. స్థానిక సానా సతీష్‌బాబు ఫౌండేషన్ కార్యాలయంలో శనివారం 2025 సంవత్సరం క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు. మాజీ డిప్యూటీ మేయర్ అరిగెల శ్రీనివాసరావు, తోట నవీన్, ఎన్.వీరేంద్ర, గంధం శ్రీను, పి.శేషు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి చర్యలు

బోట్‌క్లబ్: పార్టీని బూత్‌స్థాయిలో బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు బీజేపీ మహిళామోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాలగ్రామ లక్ష్మీప్రసన్న అన్నారు. స్థానిక బీజేపీ సాత్‌మండల అధ్యక్షుడు చెక్కా రమేష్ ఆధ్వర్యంలో శనివారం సౌత్ మండల బూత్ అధ్యక్ష ఎన్నిక నిర్వహించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ చేస్తున్న అభివృద్ధికి ప్రజలు నుంచి విశేష స్పందన లభిస్తోందన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికలో బీజేపీ రాష్ట్రంలో విజయం సాధించడం తధ్యమన్నారు. అనంతరం బూత్ అధ్యక్ష ఎన్నికలు నిర్వహించారు. 152వ బూత్ అధ్యక్షురాలిగా దొడ్డి శ్రీదుర్గ, 154వ బూత్ అధ్యక్షురాలుగా బలోపు దుర్గా మాణిక్యం, 159వ బూత్ అధ్యక్షులుగా నక్కా లోవలక్ష్మి, 158వ బూత్ అధ్యక్షులుగా మీసాల చక్రవర్తి, 163వ బూత్ అధ్యక్షులుగా బొచ్చు శ్రీవాణిని ఎన్నికయ్యారు. వీరికి నియామక పత్రాలు అందించారు. కార్యక్రమంలో ఓబీసీమోర్చా సౌత్‌మండల అధ్యక్షులు చెల్లారి సత్యనారాయణ, నాయకులు పాల్గొన్నారు.

సంక్షేమానికి బ్రాండ్ అంబాసిడర్ జగన్

- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కన్నబాబు
- ఘనంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు
- పెద్ద ఎత్తున పాల్గొన్న పార్టీ శ్రేణులు, నాయకులు, కార్యకర్తలు

కాకినాడ రూరల్: దేశ చరిత్రలోనే సంక్షేమానికి బ్రాండ్ అంబాసిడర్ మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలిచారని ఆ పార్టీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి కురసాల కన్నబాబు పేర్కొన్నారు. కాకినాడలోని వైఎస్సార్ సీపీ జిల్లా క్యాంపు కార్యాలయలంలో శనివారం వైఎస్సార్ సీపీ పార్టీశ్రేణులు, నాయకులు, కార్యకర్తలతో కలిసి కన్నబాబు పార్టీ అధినేత జగన్ మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పార్టీ జిల్లా అధ్యక్షుడు కన్నబాబు మాట్లాడారు. మోసపూరిత వాగ్దానాలు చేయడం, అధికారంలోకి వచ్చాక హామీలను తుంగలోతొక్కడం చేతకాని నాయకుడు తమ నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. చెప్పిందే చేస్తా, చేయగలిందే చెప్తా అని ధైర్యంగా చెప్పేనాయకుడన్నారు. ఒకనాయకుడు వెనకాల ఉన్నామంటే తల ఎత్తుకునే తిరిగేలా ఉండాలని, ఒక నాయకుడు వెనకాల ఉన్నామంటే ఒక ధైర్యం వెనకాల ఉన్నామనే ఫీలింగ్ ఉండాలని అవన్నీ ఒక్క జగన్‌మోహన్‌రెడ్డిలోనే ఉన్నాయన్నారు. తమ నాయకుడు అనేక పోరాటాలు, కష్టాలు ఎదుర్కొని, ధైర్యంగా నిలబడి ఇంత వరకూ వచ్చారన్నారు. అంతేకానీ ఎవరో పెట్టిన పార్టీని లాక్కొని అధికారంలోకి రాలేదని, ఎవరి పంచనోచేరి అధికారం పంచుకోలేదని తెలిపి, తన శక్తి సామర్థ్యాలతో పేదల పక్షాన, నిలబడి నేనున్నానని భరోసా కల్పించిన నాయకుడని మాజీ మంత్రి అని కన్నబాబు కొనియాడారు. 2024 ఎన్నికల్లో ప్రతి పక్ష పార్టీ సూపర్ సిక్స్ అంటూ హామీలు గుప్పించారని, మనం కూడా హామీలిద్దామని చెపితే అమలుకానీ హామీలు ఇవ్వలేనని, అమలు చేయలేని హామీలివ్వడం చేతకాదని అందరికీ చెప్పారని జగన్ అన్న మాటలను గుర్తు చేశారు. నిజాయితీతోనే ప్రజలకు ముందుకు వెళతానని, ఓటమి ఎదురైనా ఫరవా లేదని చెప్పిన దమ్మున్న నాయకుడు జగన్ అన్నారు. అటువంటి నాయకుడుతో కలిసి పనిచేసే అదృష్టం మాకందరికీ కలిగిందని, అటువంటి తమ నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి నిండునూరేళ్లు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలని కోరుకుంటుఉన్నామని పార్టీ జిల్లా అధ్యక్షుడు కన్నబాబు తెలిపారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి ఒకరికొకరు తినిపించుకుంటూ, అందరికీ పంచారు. అనంతరం కాకినాడ రూరల్ మండలం రమణయ్యపేట బాపన్నదొరకాలనీలోని ఆశ్రమ శ్రావణ, ఏపీఎస్పీ వద్ద నున్న ఆదర్శ వృద్ధుల ఆశ్రమం, బోట్‌క్లబ్ వద్ద గల శ్రద్ధ వృద్ధుల ఆశ్రమంలో ఉన్న వృద్ధులకు బ్రెడ్‌లు, పండ్లు పార్టీ నాయకులతో కలిసి కన్నబాబు అందజేశారు. రూరల్ జెడ్పీటీసీ నురుకుర్తి రామకృష్ణ, ఎంపీపీ బందిలి వీరీష, పార్టీ నాయకులు కురసాల సత్యనారాయణ, జమ్మలమడక నాగమణి, బెలవాడ సత్యనారాయణ, గీసాల శ్రీను, అనుసూరి ప్రభాకర్, పళ్లంరాజు, మోసే, కరప మండల పార్టీఅధ్యక్షుడు చింతా ఈశ్వర రావు, రావుల ప్రసాద్, నక్కా సత్తిబాబు, మార్నెళ్ల వెంకటరమణ, మేడిశెట్టి సత్తిబాబు, మద్దూరి భాస్కర్, కొత్త రవి, చింతా బుజ్జి, వెలుగుబంటి సీతారామరాఘవ, పైలా గోవిందు తదితరులు పాల్గొన్నారు.



కరపలో మాజీ సీఎం జగన్ జన్మదిన వేడుకల్లో కేక్ కట్ చేసిన జెడ్పీటీసీ, ఎంపీపీ తదితరులు



నడకుదురులోని వృద్ధులకు పండ్లు, రొట్టెలు అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



రూరల్ మండలం వృద్ధాశ్రమంలోని పండ్లు, బ్రెడ్‌లు అందజేస్తున్న మాజీ మంత్రి కన్నబాబు

కరప మండలంలో...

కరప: మండలంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను ఎంపీపీ, జెడ్పీటీసీ, గ్రామసర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ,గ్రామాన సీఎం జగన్ చిత్రపటం ముందు సర్పంచ్‌లు, పార్టీ నాయకులు కేక్ కట్ చేసి, అందరికీ పంచిపెట్టారు. కరపలోని వైఎస్సార్ విగ్రహం వద్ద ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు, మండల సర్పంచ్ సమాఖ్య అధ్యక్షుడు రొక్కాల గణేష్, మండలపార్టీ అధ్యక్షుడు చింతా ఈశ్వరరావు, సర్పంచులు వాసంశెట్టి రామారావు, పలివెల నాగేశ్వరరావు, వెలుగుబంటి సీతారామరాఘవ, గ్రామకమిటీ అధ్యక్షుడు మేడిశెట్టి సత్తిబాబు, మాజీఎంపీటీసీ పెంకే సత్తిబాబు, పార్టీనాయకులు మార్నెళ్ల వెంకటరమణ, మద్దూరి భాస్కర్, సాదే లోహిదాస్, కమిడి శంకర్, చింతా బుజ్జి, రావుల ప్రసాద్, నక్కా సత్తిబాబు, వజ్రపు కామేశ్వరరావు, పితాని శ్రీనివాస్, పేపకాయల శ్రీను, మార్నెళ్ల సిద్ధార్థ తదితర పార్టీ నాయకులు కేక్ కట్ చేసి అందరికీ పంచి, సీఎం జగన్ పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. అనంతరం నడకుదురులోని జనావళి వృద్ధాశ్రమంలోని వృద్ధులకు పండ్లు, బ్రెడ్‌లు పంచారు. వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పార్టీఅధినేత జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు జరిపారు. కేక్ కట్‌చేసి, అందరికీ పంచారు.

జగనన్న స్ఫూర్తితో ప్రజలతో మమేకం

- పార్టీ నేతలు శివప్రసన్న, రాగిరెడ్డి
- నగరంలో మాజీ సీఎం జగన్ పుట్టినరోజు వేడుకలు

కాకినాడ: అధికారంలో ఉన్నా, లేకపోయినా నిరంతరం ప్రజల శ్రేయస్సు కోసం తపించే వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి స్ఫూర్తితో ప్రతి కార్యకర్త ముందుకు సాగాలని పార్టీ కాకినాడ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న పిలుపునిచ్చారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శనివారం పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. కౌడా మాజీ చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, మాజీ కార్పొరేటర్లు, నాయకుల సమక్షంలో కేక్ కట్ చేసి సందడి చేశారు. ఈ సందర్భంగా పలు చోట్ల పండ్లు పంపిణీ చేసి సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కౌడా మాజీ చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి మాట్లాడుతూ ప్రభుత్వ వైఫల్యాలపై పార్టీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు ప్రతి కార్యకర్త ప్రజలకు మద్దతుగా పోరాడాలన్నారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పసుపులేటి వెంకటలక్ష్మి మాట్లాడుతూ ఎన్ని వేధింపులనైనా ధీటుగా ఎదుర్కొని పార్టీకి, ప్రజలకు అండగా నిలవాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. స్మార్ట్‌సిటీ మాజీ చైర్మన్ అల్లి రాజబాబు మాట్లాడుతూ ప్రజలను నమ్మించి మోసం చేసిన కూటమి సర్కార్ తీరును ప్రతి కార్యకర్త ఎండగట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రచార కమిటీ ప్రధాన కార్యదర్శి రావూరి వెంకటేశ్వరరావు, ద్వారంపూడి చారిటబుల్ ట్రస్ట్ ఆర్గనైజర్ కర్రి వీర్రెడ్డి (చినబాబు), మాజీ కార్పొరేటర్లు రాగిరెడ్డి బన్ని, పేర్ల జోగారావు, నాయకులు వాసుపల్లి కృష్ణ, బాదం మధు, డికె రెడ్డి, కోక గిరి, చక్రవర్తి, పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న పార్టీ నగరాధ్యక్షురాలు శివప్రసన్న, కౌడా మాజీ చైర్ పర్సన్ చంద్రకళాదీప్తి తదితరులు

అన్ని రంగాల్లోనూ రాణించాలి

బాలాజీచెరువు: విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లోనూ ప్రతిభ చూపాలని జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ అన్నారు. లక్ష్య ఇంటర్నేషనల్ స్కూల్ వార్షికోత్సవం శనివారం ఆ పాఠశాల ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎస్పీ మాట్లాడుతూ భవిష్యత్ లక్ష్యాలను సాధించడానికి పాఠశాల విద్య చాలా ముఖ్యమన్నారు. విద్యతో పాటు క్రీడలూ అవసరమన్నారు. ఏపీఎస్పీ కమాండెంట్ దీపిక మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడలు విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపొందింపజేయడంతోపాటు ఆత్మవిశ్వాసాన్ని పెంపొదింపజేయడంలో కీలకపాత్ర పోషిస్తాయన్నారు. అనంతరం రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రతిభ చూపిన క్రీడాకారులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆదిత్య విద్యాసంస్థల అధినేత నల్లమిల్లి శేషారెడ్డి, పాఠశాల డైరెక్టర్ సుగుణారెడ్డి, ప్రిన్సిపాల్ వందన బోథ్రా, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేసి వార్షికోత్సవం ప్రారంభిస్తున్న ఎస్పీ విక్రాంత్‌పాటిల్

వైఎస్సార్ సీపీ పటిష్టతకు కృషి చేయాలి

కాకినాడ రూరల్: వైఎస్సార్ సీపీ శ్రేణులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ గ్రామాల్లో పార్టీ పటిష్టతకు కృషి చేయాలని ఆ పార్టీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు, మాజీమంత్రి కురసాల కన్నబాబు అన్నారు. వైఎస్సార్ సీపీ గ్రీవెన్స్ కాకినాడ జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన తోటకూర శ్రీనివాస్ శనివారం కాకినాడలోని వైఎస్సార్ సీపీ జిల్లా క్యాంపు కార్యాలయంలో కన్నబాబును మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా పార్టీనాయకులకు కన్నబాబు పలు సూచనలిచ్చారు. మాజీ ముఖ్య మంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ, కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక నిర్ణయాలను, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఇంత వరకు అమలు చేయకపోవడాన్ని తెలియజేయాలన్నారు. కాకినాడ రూరల్ నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పార్టీ గ్రీవెన్స్ జిల్లా అధ్యక్షుడు తోటకూర శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న కన్నబాబు

ధ్యానంతో సంపూర్ణ ఆరోగ్యం

బాలాజీచెరువు: ధ్యానంతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఆంధ్రప్రదేశ్ యోగా విద్యాపీఠం రాష్ట్ర అధ్యక్షుడు చిట్టూరి చిట్టిబాబు పేర్కొన్నారు. స్థానిక జగన్నాథపురం ఎంఎస్ఎన్ జూనియర్ కళాశాలలో ప్రపంచ ధ్యాన దినోత్సవం సందర్భంగా శనివారం తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా చిట్టిబాబు మాట్లాడుతూ యోగా ద్వారా మంచి జ్ఞాపక శక్తి పెరుగుదలతో పాటు మంచి ఫలితాలు సాధించవచ్చన్నారు. ఆధునిక పోటీ ప్రపంచంలో తీవ్ర ఒత్తిడి,ఆందోళనతో కొట్టిమిట్టాడుతున్న ప్రతి వ్యక్తికి ధ్యానం అవసరమన్నారు. ప్రతిరోజూ దినచర్యలో భాగంగా 30 నిముషాల పాటు ధ్యాన సాధన ద్వారా రోగాలన్నింటిని తగ్గించవచ్చన్నారు. డిసెంబర్ 21వ తేదీన ప్రపంచ అంతర్జాతీయ ధ్యాన దినోత్సవంగా నిర్వహించడం సంతోషమన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ విజయకుమారి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ధ్యానంలో పాల్గొన్న విద్యార్థులు

మూడో అదనపు జిల్లా సెషన్స్ జడ్జి కోర్టు ఏపీపీగా నాగబాబు



కాకినాడ లీగల్: కాకినాడ మూడో అదనపు జిల్లా సెషన్స్ జడ్జి కోర్టుకు అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా న్యాయవాది దండుప్రోలు నాగబాబును నియమిస్తూ ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ కుమార్ విశ్వజిత్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన విధులను మూడేళ్ల కాలపరిమితికి నిర్ణయిస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఆయన కాకినాడలో 1991 నుంచి న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తున్నారు. కాగా నాగబాబును ఏపీపీగా నియమించడంతో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ముత్తింటి విశ్వేశ్వరరావు, జనరల్ సెక్రటరీ చెక్క శ్రీనివాస్, రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు నరహరశెట్టి రవికృష్ణ, న్యాయవాది శ్రీదేవి, సీనియర్ న్యాయవాదులు, న్యాయవాదులు అభినందనలు తెలిపారు.

ఫిజియోథెరపిస్టులకు మంచి భవిష్యత్

కరప: వైద్య వృత్తి ఎంతో పవిత్రమైందని, ప్రస్తుత పరిస్థితుల్లో ఫిజియోథెరపిస్టులకు మంచి భవిష్యత్ ఉందని విజయవాడ డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ మాజీ వైస్ చాన్సలర్ డాక్టర్ కోరుకొండ బాబ్జీ అన్నారు. పేషంట్లు చెప్పేది ఓపిగ్గా విని, వారి మానసిక పరిస్థితిని గమనించి సేవలందిస్తే మంచి ఫిజియోథెరపిస్టుగా గుర్తింపు లభిస్తుందన్నారు. పెనుగుదురులోని కాకినాడ సిమ్స్ కాలేజ్ ఆఫ్ ఫిజియోథెరపీ కళాశాలలో శనివారం సాయంత్రం జరిగిన ఫిజియోథెరపీ స్నాతకోత్సవం (గ్రాడ్యుయేషన్ డే)లో ఆయన పాల్గొని మాట్లాడారు. ఫిజియోథెరపీ ప్రాముఖ్యత, దాని ఆవశ్యకత తదితర అంశాలను వివరించారు. ఫిజియోథెరపీ కోర్సు పూర్తి చేసుకున్నవారితో ప్రతిజ్ఞ చేయించి, సర్టిఫికెట్లను డాక్టర్ బాబ్జీ, డాక్టర్ శిరీష అందజేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీ సూర్యప్రకాష్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ఫిజియోథెరపీ గ్రాడ్యుయేట్స్‌తో మాజీ వైస్ చాన్స్‌లర్, సెక్రటరీ, ప్రిన్సిపాల్

ఎన్టీఆర్ బీచ్‌లో నేడు పారా మోటారింగ్ రిక్రియేషన్



కాకినాడ ఎన్టీఆర్ బీచ్‌లో ఏర్పాటు చేస్తున్న పారా మోటారింగ్ రిక్రియేషన్

నాగమల్లితోట జంక్షన్(కాకినాడ సిటీ): కలెక్టర్ షణ్మోహన్ ఆదేశాల మేరకు క్రిస్మస్, సంక్రాంతి పండుగుల సందర్భంగా ఆదివారం కాకినాడ ఎన్టీఆర్ బీచ్‌లో పారా మోటారింగ్ రిక్రియేషన్ ఏర్పాటు చేసినట్లు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి బి.శ్రీనివాస్ కుమార్ శనివారం తెలిపారు. సందర్శకులు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

దయ, కరుణకు చిరునామా ఏసుక్రీస్తు



ఐక్యక్రిస్మస్ వేడుకల్లో పేదలకు చీరలు, దుప్పట్లు అందజేస్తున్న మాజీమంత్రి కన్నబాబు

కాకినాడరూరల్: మానవులపై చూపించే దయ, ప్రేమ, కరుణకు చిరునామా ఏసుక్రీస్తు అని వైఎస్సార్‌సీపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు, మాజీమంత్రి కురసాల కన్నబాబు పేర్కొన్నారు. ప్రభువు చూపిన బాటలో ప్రతి ఒక్కరూ నడుస్తూ, ఎదుటి మనిషిపై ప్రేమ, కరుణ చూపాలన్నారు. కొవ్వాడలో శనివారం రాత్రి సలాది వంశీయులు నిర్వహించిన ఐక్య క్రిస్మస్ వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈసందర్భంగా వంద మంది పేదలకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు. సంఘకాపరి రవీంద్రబాబు, వలసల జాన్‌ప్రభాకర్, వైఎస్సార్ సీపీ నాయకులు గోపిశెట్టి బాబ్జీ, తోటకూర శ్రీనివాస్, గీసాల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ధనుర్మాస వ్రతం

బోట్‌క్లబ్: స్థానిక భోగి గణపతి పీఠంలో శనివారం శ్రీవారి సేవా సమాజం సభ్యులు అష్టోత్తర శత నామ పారాయణతో వెండి పుష్పాలతో గోదాదేవికి ధనుర్మాస పూజలు ఎంతో వైభవంగా నిర్వహించారు. తొలుత గణపతి విష్వక్సేన పూజ, వేంకటేశ్వరస్వామి వారికి పంచామృతాభిషేకం, తోమాల సేవ నిర్వహించారు. పీఠంలో 64వ జపయజ్ఞ పారాయణ సందర్భంగా కన్యలతో గోదాదేవి శ్రీరంగనాథుల వ్రత పూజ నిర్వహించారు. తిరుప్పావై కీర్తనలను ఆలపించారు. పీఠం వ్యవస్థాపకులు దూసర్లపూడి రమణరాజు మాట్లాడుతూ ధనుర్మాసం మానవజీవితానికి ధన్యత పొందేందుకు ఆధ్యాత్మిక మార్గాన్ని అందిస్తుందన్నారు. ఈ నెల 28న పీఠంలో వ్రత యజ్ఞం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈ సందర్భంగా 108 ముత్తైదువులకు పసుపు, కుంకుమ, గాజులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



భోగి గణపతి పీఠంలో ప్రత్యేక అలంకరణలో గోదాదేవి అమ్మవారు

క్రికెట్ కిట్ అందజేత

కరప: స్థానిక నక్కా సూర్యనారాయణమూర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో శనివారం గ్రామంలోని పల్లపువీధి క్రికెట్ జట్టుకు కరప డీసీ చైర్మన్ పీజీ సత్యనారాయణ సమకూర్చిన క్రికెట్ కిట్‌ను మాజీసర్పంచ్ పోలిశెట్టి తాతీలు అందజేశారు. కరపలో జరిగే సంక్రాంతి క్రికెట్ టోర్నమెంట్ పాల్గొనే పల్లపు వీధి క్రికెట్ జట్టు సభ్యులకు క్రికెట్ కిట్ కావాలని అడగగా డీసీచైర్మన్ పీజీ రూ.17 వేలు విలువ చేసే కిట్‌ను సమకూర్చినట్టు మాజీ సర్పంచ్ తెలిపారు.



కరపలో పల్లపువీధి జట్టుకు క్రికెట్ కిట్‌ను అందజేస్తున్న మాజీ సర్పంచ్ తాతీలు

క్రిస్మస్‌కు ముస్తాబైన చర్చిలు

నాగమల్లితోట జంక్షన్(కాకినాడ సిటీ): నగరంలో చర్చిలు ముస్తాబయ్యాయి. విద్యుద్దీపాలతో వెలుగులు విరజిమ్ముతున్నాయి. చర్చలు, ఇళ్లు, ప్రధాన కూడళ్ల వద్ద ఏర్పాటు చేసిన స్టార్లు, క్రిస్మస్ ట్రీలతో వీధులన్నీ శోభాయామానంగా ఉన్నాయి. సర్వమానవాళికి శాంతి, ప్రేమ, దయను బోధించిన క్రీస్తు పుట్టిన రోజును అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించాడానికి నగరం ముస్తాబైంది. వివిధ సేవా సంస్థలు, మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో క్రైస్తవులు నిర్వహిస్తున్న సెమీ క్రిస్మస్ సంబరాలు అంబరాన్ని అంటుతున్నాయి. నగరంలో స్థానిక అర్బన్ తహసీల్దార్ కార్యాలయ సమీపంలోని గ్రేగ్‌మెమోరియల్ బాప్టిస్టు చర్చి, గాంధీనగర్‌లోని గ్రేగ్ ఇమ్మానుయేల్ బాప్టిస్టు చర్చి, ఆంధ్రాబాప్టిస్టు సెంటనరీ చర్చి, హౌస్‌ఆఫ్ ప్రేయర్ చర్చి, భానుగుడిలోని రిజర్వ్ లైన్స్ బాప్టిస్టు చర్చి, రామారావు పేటలోని సెయింట్ లూథరన్‌చర్చి, జెడ్పీ సెంటర్ సమీపంలోని కల్వరి టెంపుల్, సిటీ టాబర్నికల్ చర్చిలను విద్యుద్దీపాలతో అలంకరించారు.



కాకినాడ అర్బన్ తహసీల్దార్ కార్యాలయం సమీపంలోని గ్రేగ్ మెమోరియల్ బాప్టిస్టు చర్చి వెలుగులు



గాంధీనగర్‌లోని హౌస్‌ఆఫ్ ప్రేయర్ చర్చి

విద్యార్థిని ఆచూకీ లభ్యం

కాకినాడరూరల్: అమ్మమ్మతో గొడవపడి ఇంటి నుంచి వెళ్లి కనబడకుండాపోయిన విద్యార్థిని ఆచూకీ లభ్యమైనట్టు ఇంద్రపాలెం ఎస్ఐ వీరబాబు శనివారం తెలిపారు. కాకినాడ రూరల్ మండలానికి చెందిన పదో తరగతి చదువుతున్న విద్యార్థిని ఈనెల 18వ తేదీన అమ్మమ్మతో గొడవపడి బయటకు వెళ్లి, తిరిగి రాలేదు. ఆమె తల్లి ఇచ్చిన ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేయగా కాకినాడ ప్రభుత్వాసుపత్రి వద్ద కనబడగా, ఆమెకు కౌన్సిలింగ్ ఇచ్చి, తల్లిదండ్రులకు అప్పగించినట్టు ఎస్ఐ తెలిపారు.

పరిశ్రమల యజమానులకు నోటీసులు

కాకినాడ రూరల్: వాకలపూడి పారిశ్రామిక ప్రాంతంలోని పరిశ్రమల యజమానులకు శనివారం కాలుష్య నియంత్రణ మండలి అధికారులు నోటీసులు జారీ చేశారు. వాకలపూడిలోని కొన్ని పరశ్రమలు(కంపెనీలు) నుంచి వ్యర్థాలను నిర్లక్ష్యంగా బయటకు వదిలివేస్తుండడంతో దుర్వాసన వస్తోందని ఆప్రాంత ప్రజలు అధికారులకు ఫిర్యాదు చేశారు. కాలుష్య నియంత్రణ మండలి ఈఈ ఎంబీఎస్ శంకరరావు సిబ్బందితో కలిసి శనివారం వాకలపూడి, సూర్యారావుపేట తదితర ప్రాంతాలలోని పరిశ్రమలలో తనిఖీలు నిర్వహించారు. ఆయా కంపెనీలలో రామెటీరియల్ నుంచి శాంపిల్స్ తీసి, పరీక్షించేందుకు ల్యాబ్‌కు పంపించామని, నివేదికల ఆధారంగా చర్యలు తీసుకుంటామని ఈఈ తెలిపారు.

విద్యుత్ సరఫరాకు రేపు అంతరాయం

కాకినాడ: విద్యుత్ వార్షిక మరమ్మతుల కారణంగా సోమవారం ఉదయం 11 నుంచి 4 గంటల వరకు జగన్నాథపురం విద్యుత్ ఉపకేంద్రం పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్(ఈఈ) ఎన్.ఉదయ్‌భాస్కర్ తెలిపారు. ఫీడర్ పరిధిలోని ముత్తానగర్, గోళీలపేట, వలందపేట, తుఫాన్‌బిల్డింగ్, పోర్టుకాలనీ, జె.రామారావుపేట, కోమలివారివీధి, చిన్నిమెస్ ఏరియా, జమ్మిచెట్టు సెంటర్, చిన్నమార్కెట్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.